పాపిరెడ్డినగర్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పాపిరెడ్డినగర్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ గురువారం కోరారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, రాజీవ్ స్వగృహ, రాజీవ్ గృహకల్ప, సురభి కాలనీ, నందయ్యనగర్‌ల పరిధిలో సుమారు 45 వేల ప్రజలు నివాసం ఉంటున్నారు. ముఖ్యంగా కొంతమంది డ్రగ్స్, గంజాయి వంటి దురలవాట్లకు గురైన మహిళలు, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. యువత, విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండేందుకు నిరంతరం పోలీసుల నిఘా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. 24 గంటల పాటు పోలీస్ అవుట్ పోస్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌ను కోరారు.

అపర్ణ సైబర్ జోన్‌లో కార్పొరేటర్ పర్యటన



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్ల అపర్ణ సైబర్‌జోన్‌లో కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగం చెత్త సేకరణ ప్రతి రోజు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని అధికారులకు సూచించారు. సర్కిల్ ఏఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ శిరీష, ఏఈ రషీద్, అపర్ణ సైబర్ జోన్ ప్రెసిడెంట్‌లలిత్ చౌదరి, ప్రతినిధులు రాజీవ్ సింగ్, సిద్ధార్థ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ జలమయం



శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వర్షం నిరంతరం పడటం వలన కాలనీ, బస్తీల రోడ్లన్నీ వరద నీటితో నిండిపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందుల పాలవుతున్నారు. రోడ్లపై వరద నీరు ఎప్పటికప్పుడు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిజాంపేట్: వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సాయినగర్ ఆదిత్య గార్డెన్ కాలనీలో గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆదిత్య గార్డెన్ నూతన ప్రాంతాలు నీట మునిగిపోయాయి. దీంతో ఉదయం అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. వర్షం వల్ల వరద నీరు తర్కు చెరువులోకి వెళ్లేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టారు. అదేవిధంగా రోడ్డుపై చేరుకుపోయిన బురదను జేసీబీలతో తొలగించి కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఎల్లప్పుడూ ప్రజలకు సహాయ చర్యలు చేపట్టడంలో వెనుకడుగు వేసేది లేదని కమిషనర్ అన్నారు. రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు సైతం ఆదిత్య గార్డెన్‌లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

27న బాచుపల్లిలో బోనాలు

నిజాంపేట్: బాచుపల్లిలో ఈ నెల 27వ తేదీన శ్రావణమాసం బోనాలు ఘనంగా నిర్వహించనున్నారు. మాజీ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్‌ను కలిసి బోనా ల ఉత్సవాలకు ఆహ్వానించారు. శ్రావణ మాసం బోనాల సందర్భంగా ఇప్పటికే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని, ఉత్సవాలకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెమి దేవేందర్, మాజీ కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి లేబర్ సెల్ అధ్యక్షులు కందడి సుదర్శన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి వద్ద.. ట్రాఫిక్ కష్టాలు!

- ట్రాఫిక్ పోలీసులకు తప్పని అష్టకష్టాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు



శేరిలింగంపల్లి: గచ్చిబౌలి–శేరిలింగంపల్లికి మధ్యన లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌కు సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గురువారం ఉదయం ఈ సమస్యతో వాహనదారులు, ట్రాఫిక్ పోలీసులు, పాదచారులు నానా ఇక్కట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే రకమైన పరిస్థితి నిత్యం ఉంటోందని వాహనదారులు వాపోతున్నారు.

- నలువైపుల నుంచి ఒకేసారి వాహనాల రాకపోకలతో నిత్యం వాహనదారు లు, పాదచారులు నానా ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇక్కడ విధులను నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు ఉదయం, సాయంత్రం అష్టకష్టాలు పడాల్సి రావడం నిత్యం జరిగే తంతుగా మారింది.
- అండర్‌బ్రిడ్జి ద్వారానే గచ్చిబౌలి వైపు అంటే ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్,మాదాపూర్, ఔటర్‌రింగురోడ్డు వంటి ప్రాంతాలకు ఉన్నత విద్యాసంస్థలు, శిక్షణ, ఐటీ సంస్థల కార్యాలయాలకు వెళ్లాల్సిన వారు ఉదయం 8 నుంచి పది గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి విపరీతమైన ట్రాఫిక్ ఉంటోంది. ఇదే సమయంలో ఎంఎంటీఎస్ రైళ్ల కోసం, ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్ల కోసం కూడా ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కోసం రాక పోకలు సాగిస్తుంటారు.
- దీనికితోడు అండర్‌బ్రిడ్జికి ఎదురుగానే 1200 మంది చదువుకునే శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొనసాగడం, పాపిరెడ్డినగర్, సురభి కాలనీకి రాకపోకలు సాగించే వారు కూడా వస్తుండటంతో అందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
- ఇక్కడ విధులను నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు నానా హైరానా పడాల్సి వస్తోంది. దీనికితోడు ఏ ఒక్కరూ కూడా లైన్లో వెళ్లదామని చూసే పరిస్థితి ఉండకుండా కొంచం దారి దొరికితే చాలు దూరి పోతూ నానా ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించడంతోనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రత్యామ్నాయంగా ఆర్‌ఓబీ నిర్మిస్తేనే సమస్యలన్నీ తీరుతాయని అందరూ అభిప్రాయపడుతున్నారు.



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

చిన్నారులకు పలకలు, పుస్తకాల పంపిణీ



చిన్నారులకు పుస్తకాలు, పెన్సిల్స్ అందిస్తున్న కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి.రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ, మధురానగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పలు వస్తువులను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్, శేరిలింగంపల్లి సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు మధురానగర్, ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చదివే చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్, క్రయాన్స్‌కలర్ పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆయా కేంద్రాలలో కేక్‌ను చిన్నారులతో ఆయన కట్ చేయించి వారికి పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాధన అనంతరం సీఎంగా కేసీఆర్, మంత్రిగా కేటీ రామారావు శేరిలింగంపల్లిలో చేసిన అభివృద్ధి మరువలేనిదన్నారు. శేరిలింగంపల్లి రూపురేఖలనే మార్చివేశారని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తామని, బీఆర్‌ఎస్‌కు శేరిలింగంపల్లిలో పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు చెన్నంరాజు, రాగం జంగయ్య యాదవ్, దారుగుపల్లి నరేష్, అంజమ్మ, బాలమణి, ప్రభాకర్, పొన్నయ్య మాధవి, నారాయణ, నరేష్‌సింగ్, భిక్షపతి, ఖాదర్‌ఖాన్, మక్బూల్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ ఆస్పత్రిలో...

కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో రోగులకు బీఆర్‌ఎస్ నాయకులు తిరుమలేష్ నాయకత్వంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నాయకులు పట్లోళ్ల నర్సింహారెడ్డి, రాపోలు రాజశేఖర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం



చందానగర్: పవిత్ర చాతుర్మాస్య దీక్షలో భాగంగా అమావాస్య గురువారం చందానగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సముదాయంలో శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి ఇద్దరు కలిసి చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆషాఢ మాసం చివరి రోజు అమావాస్య కావడం, శ్రీ చండీ హోమం నిర్వహించడం వలన ప్రజలందరికి విజయం, బలం, ఆరోగ్య ప్రాప్తి లభిస్తాయన్నారు. చండీ హోమంలో ఆలయ ప్రధాన అర్చకులు సాయి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాతావరణ అనుకూల నిర్మాణ విధానాలు అవసరం

'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మహిళా ప్రతినిధులు

రాయదుర్గం: వాతావరణ అనుకూల నిర్మాణ విధానాలు అవసరమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లోని క్లైమేట్ చేంజ్ సెంటర్ ఆధ్వర్యంలో 'సస్టేనబుల్ పర్యావరణం, వాతావరణ మార్పులకు అనుకూలంగా బీఎఫ్ఆర్‌పీ/జీఎఫ్ఆర్‌పి రీబార్ కంపోజిట్స్‌తో ఫైబర్ రీఫోర్స్డ్ కాంక్రీట్‌లో అభివృద్ధి' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఎఫ్ఆర్‌పీ, జీఎఫ్ఆర్‌పీ రీబార్లు వంటి ఆధునిక పదార్థాలు తక్కువ బరువుతో, తక్కువ కార్బన్ ఉద్గారాలతో, తుపానులకు తేమకు, సముద్ర ప్రాంతాలకు తట్టుకొనే సామర్థ్యంతో నిర్మాణాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ రంగ ప్రముఖులు రాజీవ్ బిష్ట్, డాక్టర్ చంద్రకళ, నరేష్ మాట్లాడుతూ... పర్యావరణ అనుకూల నిర్మాణ పదార్థాల వినియోగం ద్వారా నిర్మాణమైన అపురూప మన్నిక సాధించడం అవసరమన్నారు. నూతన నిర్మాణ పద్ధతులను వినియోగంతో నిర్మాణ జీవిత కాలం పెరుగుతుందన్నారు. నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని, మొత్తం కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయని వివరించారు. పునర్వినియోగం, వ్యర్థ పదార్థాల తగ్గింపు వంటి అంశాల్లో ఇవి సర్క్యులర్ ఎకానమీ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. సుస్థిర సాంకేతిక పరిష్కారాల పరంగా జ్ఞాన మార్పిడి, సామర్థ్య వృద్ధి, సమర్థవంతమైన అమలుకు తీసుకున్న మరో ముందడుగుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, ఫ్యాకల్టీ, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలి

పటాన్‌చెరు టౌన్: సిగాచీ పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి 25 రోజులు దాటిందని, ఒక్కో కార్మిక కుటుంబానికి రూ. కోటి ప్రకటించి, ప్రస్తుతం రూ. 10 లక్షలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మాట్లాడుతూ... మిగిత డబ్బులు దశలవారీగా ఇస్తామనడం దారుణం అన్నారు. తక్షణమే పూర్తిస్థాయి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆచూకీ దొరకని కార్మిక కుటుంబాలకు రూ. 15 లక్షలు ఇచ్చి, వారిని స్వస్థలాలకు పంపించారని. బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించడంలో అధికారులు, యాజమాన్యం నిర్లక్ష్యం చేయటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత

కేపీహెచ్‌బీకాలనీ: తప్పిపోయిన ఓ విద్యార్థిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కేపీహెచ్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ వివరాల ప్రకారం.. హెచ్‌ఎంటీ హిల్స్, రామాలయం సమీపంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో చదువుతున్న ఎస్. సమన్విత (12) పాఠశాల ఆవరణ నుంచి బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సమీపంలోని సీసీ టీవీ ఫుటేజిని పరిశీలించి పాఠశాల సమీపంలోని కిరాణ జనరల్ స్టోర్ వద్ద ఆమెను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



శుభ్రత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

జిన్నారం (పటాన్‌చెరు): వర్షాకాలం సిజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కోమలి, నిర్మలా రెడ్డిలు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం గడ్డపోతారం, బొల్లారం పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాల్లో వారు వేర్వేరుగా మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన సూచనలను వైద్య సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, వెంకటరామయ్య, కిషన్, కార్యాలయ అధికారులు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీ సమీపంలోని డంపింగ్‌యార్డుతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కిషన్‌ను స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చెత్తసేకరణ వాహనాలను స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే స్పందించిన కమిషనర్ కిషన్ వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. డంపుయార్డుతో స్థానికంగా దుర్వాసన ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపు యార్డును మరోచోటికి తరలించి తమ ఆరోగ్యాలను కాపాడాలని లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గాంధీనగర్ ప్రజలు పాల్గొన్నారు.

గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తాను అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే గాంధీకి వివరిస్తున్న కాలనీ వాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తాను అభివృద్ధి చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు గురువారం వినతి పత్రం సమర్పించారు. రోజు రోజుకూ ట్రాఫిక్ పెరిగి వాహనదారులు, పాదచారులు, పరిసర కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అదే విధంగా కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్, సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన గాంధీ మాట్లాడుతూ... త్వరలో కాలనీలో పర్యటిస్తానని తెలిపారు. కాలనీలో సమస్యలను, చౌరస్తా అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీ అధ్యక్షుడు షేక్ ఖాసీం, మాజీ వైస్ చైర్మన్ కె.బి.వి.సుబ్బారావు, కాలనీ ప్రధాన కార్యదర్శి అనంద్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సీజనల్ వ్యాధులకు చెక్



అవగాహన కల్పిస్తున్న వార్డు అధికారులు

మణికొండ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటే సీజన్ వాధులకు చెక్ పెట్టవచ్చని అధికారులు సూచించారు. వాతావరణంలో మార్పులు నెలకొన్నందున ప్రజలు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని నార్సింగి మున్సిపాలిటీ వార్డు అధికారులు రాజశ్రీ, సుష్మ, ఏఎన్‌ఎంలు నిర్మల, స్వరూప సూచించారు. గురువారం మంచిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నీటిని వేడి చేసుకుని తాగాలని, వేడి పదార్థాలనే తినాలని, బయటి పదార్థాలను తినవద్దని సూచించారు. అనంతరం కోకాపేట పోయనిక్స్ గ్రీన్ స్కూల్‌లో తడి చెత్తతో వర్మి కంపోస్టు ఎరువుగా తయారు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. నార్సింగి అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు తడి, పొడి చెత్త వేరు చేయటంపై అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లు సుజాత, రుక్మిణి, శ్రీదేవి, వార్డు అధికారులు గణేష్, శ్యామ్‌గౌడ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మీ సేవ నిర్వాహకులు



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి దయసాగర్ ఆధ్వర్యంలో మీ సేవ నిర్వాహకులు గురువారం మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సీఎస్‌సీ, ఎస్‌పీసీ సంస్థలతో కుదుర్చుకున్న మీసేవ సర్వీసుల అవగాహన ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, దీని వల్ల మీసేవ నిర్వాహకులు నష్టపోతున్నారన్నారు. మీసేవ లాగిన్‌లో ఆర్.ఓ.ఆర్, 1బీ, పహాణీని తిరిగి చేర్చాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆధార్ సెంటర్ల నిర్వాహకులకు యూఐడీఏఐ వేసిన ఫైన్లను రద్దు చేయాలని కోరారు. ఆధార్ సెంటర్లకు రూ.1.50లక్షల డిపాజిట్ల నిబంధనను తొలగించాలన్నారు. అదే విధంగా మీ సేవ నిర్వాహకుల కమీషన్లను పెంచాలని, వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ సరిఫికెట్లు వెంటనే జారీ అయ్యేలా చూడాలన్నారు. ఉచిత కరెంట్, ఇంటర్‌నెట్ వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మోహిన్, ట్రెజరర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్.. ఫైరింజన్ వెళ్లేదెలా?

అసలే ఇరుకుదారి.. ఆపై వాహనాల పార్కింగ్

- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- నిన్నటి అగ్ని ప్రమాదంతోనైనా కనువిప్పు కలిగేనా?

> అధికారుల నిర్లక్ష్యం.. అక్రమ నిర్మాణదారుల స్వార్థం.. ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకుల ధనదాహం.. వెరసి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ అత్యంత ప్రమాదకర పరిస్థితులకు నిలయంగా మారింది. మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఓ చిన్న అగ్ని ప్రమాదం పెను విషాదంగా మారకుండా తృటిలో తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకున్నప్పటికీ రోడ్డుకు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాల వల్ల ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకోవడంలో జాప్యం జరిగింది. అదృష్టవశాత్తు అగ్ని ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనం మాత్రమే దగ్ధం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



కేపీహెచ్‌బీకాలనీలో ఇరుకుగా అత్యవసర వాహనాలు కూడా వెళ్లలే ని స్థితిలో అంతర్గత రోడ్లు, వాహనాల పార్కింగ్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని మూడవ రోడ్డులో ఎల్ఐజీ గృహాల వద్ద మంగళవారం రాత్రి 2 గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. పక్కనే పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనికి మంటలు వ్యాపించాయి. ఫైరింజన్ వచ్చినా ఘటనా స్థలానికి రావడంలో ఆలస్యమైంది. అసలే ఇరుకైన రోడ్లు, వంద గజాల స్థలంలో ఐదేసి అంతస్తుల నిర్మాణాలు చేపట్టి హాస్టల్స్‌కు అద్దెకు ఇచ్చారు. హాస్టల్స్‌లో వందమందికి పైగా వసతి పొందుతూ వారి ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ఇరుకైన సందుల్లో, రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన టూ వీలర్ల వల్ల ఫైర్ ఇంజన్ ముందుకు కదలలేకపోయింది. అగ్ని మాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి, కొన్ని వాహనాలను పక్కకు తీసిన తర్వాతే ముందుకు కదలగలిగారు. ఈ జాప్యం కారణంగా మంటలు మరింత వ్యాపించాయి. అదృష్టవశాత్తు ఈ ప్రమాదం కేవలం ఒక టూ వీలర్‌కు మాత్రమే పరిమితం కావడంతో పెద్ద నష్టం జరగలేదు. ప్రమాద తీవ్రత పెరిగి ఏదైనా హాస్టల్ భవనం, నివాస సముదాయానికి మంటలు వ్యాపించి ఉంటే పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత రద్దీ ప్రదేశంగా హౌసింగ్ బోర్డు

కేపీహెచ్‌బీకాలనీలో ప్రజలతో పాటు వ్యాపారస్తులు కూడా తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. సరిగ్గా ఇరవై అడుగులు కూడా లేని అంతర్గత రోడ్లను ఇష్టారాజ్యంగా ఆక్రమించడం, ఎవరికి వారే అక్రమంగా రోడ్లపై వ్యాపారాలు చేయటం, నిబంధనలకు విరుద్ధంగా ఐదు అంతస్తుల భవనాలు నిర్మించడం, కనీసం పార్కింగ్ సదుపాయం లేకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లో కిచెన్లు ఏర్పాటు చేయడం వంటివి ఎక్కడ చూసినా దర్శనం ఇస్తుండటం గమనార్హం. కేవలం ధనార్జనపై దృష్టి పెట్టడం, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం ఇక్కడి విధుల్లో సాధారణ ప్రక్రియగా మారింది.

అక్రమ పార్కింగ్.. పొంచి ఉన్న ప్రమాదం!

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కనీస దూరం పాటించకుండా అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అత్యవసర సేవల వాహనాలకు, ముఖ్యంగా అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్‌లకు దారి ఇవ్వడం ప్రజల కనీస బాధ్యత. అవేమీ పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలపడం వల్ల తరచుగా ఇలాంటి ప్రమాదకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, చిన్నపాటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాన్ని కనువిప్పుగా భావించి సంబంధిత విభాగాల అధికారుల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఎగిసి పడుతున్న మంటలు దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం